ఎంఎస్పీపై ఐదేండ్ల ఒప్పందం!

రైతులతో కేంద్ర సంస్థల కాంట్రాక్టు

ఐదేండ్ల పాటు పప్పులు, మక్కజొన్న, పత్తి పంటలకు ఎంఎస్పీ • కేంద్రం ప్రతిపాదన
• తిరస్కరించిన రైతు సంఘాలు • నాలుగో దఫా చర్చలూ విఫలం

చండీగఢ్, ఫిబ్రవరి 19: ఎంఎస్పీకి చట్టబద్ధతతో సహా పలు డిమాండ్ల సాధనకు 'ఢిల్లీ చలో' పేరిట ఆందోళన చేపట్టిన రైతులతో కేంద్ర ప్రభుత్వం జరిపిన నాలుగో విడత చర్చలు విఫలం అయ్యాయి. కనీస మద్దతు ధర విషయంలో కేంద్ర సర్కార్ ఐదేండ్ల ప్లాన్‌ను ప్రతిపాదించగా.. దాన్ని రైతు నేతలు తిరస్కరించారు. ఒప్పందం మేరకు ఐదేండ్ల పాటు పప్పుధాన్యాలు, మక్కజొన్న, పత్తిని ఎంఎస్పీకి కొనుగోలు చేస్తామని కేంద్ర మంత్రులు ఆదివారం రాత్రి చర్చల అనంతరం పేర్కొన్నారు. దీనిపై సోమవారం చర్చలు జరిపిన రైతు నేతలు, కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. కేంద్రం తెచ్చిన ప్రతిపాదన రైతులకు ఎంత మాత్రం ప్రయోజనం చేకూర్చదని రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా, నిత్యానంద్ రాయ్ బృందం ఆదివారం రాత్రి 8.15 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు రైతు సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపింది. అనంతరం గోయల్ మీడియాతో మాట్లాడుతూ రైతులతో ఒప్పందం కుదుర్చుకొన్న తర్వాత కేంద్ర సంస్థలు వారి నుంచి ఐదేండ్లపాటు పప్పుధాన్యాలు, మక్కజొన్న, పత్తి పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తాయని తెలిపారు. ఈ మేరకు కందులు, మినుములు, మసూర్ పప్పు, మక్కజొన్న పండించే రైతులతో కేంద్ర సంస్థలు ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ ఒప్పందం కుదుర్చుకొంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా కొనుగోలు చేసే పంట ఉత్పత్తి పరిమాణంపై ఎలాంటి పరిమితి ఉండదన్నారు. ఇందు కోసం ఒక పోర్టల్‌ను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఆందోళనలను విరమించాలని ఈ సందర్భంగా ఆయన రైతులను కోరారు. రైతులు చేస్తున్న ఇతర డిమాండ్లు పాలసీకి సంబంధించినవని, వీటిపై లోతైన చర్చ జరగాల్సి ఉందన్నారు.

రైతు నేతలతో చర్చలు జరుపుతున్న కేంద్ర మంత్రులు.. పాల్గొన్న పంజాబ్ సీఎం మాన్

చట్టబద్ధతపై వెనక్కు తగ్గేది లేదు

అంతకుముందు రైతు నేత శర్వాన్ సింగ్ పంధేర్ సోమవారం పంజాబ్-హర్యానా సరిహద్దు శంభు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఎంఎస్పీకి చట్టబద్ధతపై వెనక్కు తగ్గేది లేదని శర్వాన్ సింగ్ స్పష్టం చేశారు. రైతు రుణమాఫీతో సహా పలు ఇతర డిమాండ్లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు.

చర్చల్లో పాల్గొన్న పంజాబ్ సీఎం

కేంద్ర మంత్రులతో జరిగిన చర్చల్లో పంజాబ్ సీఎం భగవంత్ మాన్ కూడా పాల్గొన్నారు. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మొజాంబిక్, కొలంబియా నుంచి పప్పుధాన్యాలను దిగుమతి చేసుకొంటున్న అంశాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ దిగుమతులు 200 కోట్ల డాలర్ల మేర ఉన్నాయని, దేశంలో ఈ పంటలకు కనీస మద్దతు ధర ఇస్తే, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో పంజాబ్ దేశంలోనే అగ్రభాగాన ఉంటుందని అన్నారు.

కేంద్రం ప్రతిపాదనను తిరస్కరించిన ఎస్కేఎం

కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) తిరస్కరించింది. సీ2+50% విధానంలో ఎంఎస్పీ కల్పించాలన్న డిమాండ్ నుంచి పక్కదారి పట్టించేందుకు, ఆ డిమాండ్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం తాజా ప్రతిపాదనలు చేసిందని ఓ ప్రకటనలో అభిప్రాయపడింది. కేంద్ర మంత్రులు చేసిన ప్రతిపాదనల్లో ఎంఎస్పీ అనేది సీ2+50% విధానంలో లేదా ఏ2+ఎఫ్ఎల్+50% ఫార్ములా ఆధారంగా ఇస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వలేదని అభ్యంతరం వ్యక్తం చేసింది. అన్ని పంటలను ఎంఎస్పీకి కచ్చితంగా కొనుగోలు చేయడం మినహా మరే ప్రతిపాదనలు ఆమోదనీయం కాదని పేర్కొన్నది. ఎంఎస్పీపై 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని బీజేపీ నిలబెట్టుకోలేకుంటే.. ఆ విషయాన్ని నిజాయితీగా ప్రజలకు చెప్పాలని ఎస్కేఎం పేర్కొన్నది.

23న ఢిల్లీకి మార్చ్: నోయిడా రైతులు

మరోవైపు తమ సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేస్తున్న నోయిడా, గ్రేటర్ నోయిడా రైతులు ఈనెల 23న ఢిల్లీకి మార్చ్ చేపడుతామని హెచ్చరించారు. గతంలో సేకరించిన తమ భూములకు పరిహారాన్ని పెంచాలని, ప్లాట్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. స్థానిక అధికారులు, దాద్రిలోని ఎన్టీపీసీకి వ్యతిరేకంగా దాదాపు 200 గ్రామాలకు చెందిన రైతులు గత ఏడాది డిసెంబర్ నుంచి ఆందోళనలు చేస్తున్నారు. వేలాది మంది ఈ నెల 8న ఢిల్లీకి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా.. నోయిడా సరిహద్దుల్లో పోలీసులు మధ్యలోనే అడ్డుకొన్నారు.

ఆతిథ్యానికి అందమైన వందనం

ఈ ఏడాది ప్రపంచ సుందరి పోటీలు సోమవారం భారత్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ దేశాలకు చెందిన అందగత్తెలు ఢిల్లీలోని జాతిపిత మహాత్మాగాంధీ సమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం ఒక కార్యక్రమంలో చిరు నవ్వులు చిందిస్తూ ఇలా ఫొటోలకు పోజులిచ్చారు.

ఇంటి కిరాయి చెల్లించే కంటే విమానంలో వెళ్లిరావడమే బెటర్!

వాంకోవర్: కెనడాలోని కాల్గరీ, వాంకోవర్ నగరాల మధ్య దూరం దాదాపు 700 కిలోమీటర్లు. వాంకోవర్ పట్టణంలో ఇంటి అద్దెలను చూస్తే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. ఎంతలా అంటే భారీగా ఉండే అద్దెను చెల్లించడం కంటే ఓ విద్యార్థి విమానంలో వెళ్లి తరగతులకు హాజరవడమే నయం అనుకొనేలా పరిస్థితి ఉన్నది. వారానికి రెండు సార్లు విమానంలో కాల్గరీ నుంచి వాంకోవర్‌కు ప్రయాణిస్తున్న యూనివర్సిటీ ఆఫ్ కొలంబియా(యూబీసీ)కి చెందిన టిమ్ చెన్ అనే విద్యార్థి ప్రస్తుతం మీడియాలో హైడ్‌లైన్స్‌లో నిలిచాడు. వాంకోవర్‌లో సింగిల్ బెడ్‌రూమ్ ఇంటికి దాదాపుగా రూ.1.74 లక్షలు వెచ్చించాల్సి వస్తుండగా.. అదే ఒక రౌండ్ విమాన ప్రయాణానికి 150 డాలర్ల చొప్పున నెలకు ఎనిమిది ట్రిప్పులకు రూ.99 వేలు మాత్రమే ఖర్చు అవుతున్నదని టిమ్ చెన్ తన అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకొన్నారు. టిమ్ పోస్టుపై నెటిజన్లు పలు విధాలుగా స్పందిస్తున్నారు. దీని వల్ల చాలా సమయం వృథా అవుతుందని ఒకరు పేర్కొనగా, ఆధునిక సమస్యలకు ఆధునిక పరిష్కారమంటూ మరో యూజర్ అభిప్రాయపడ్డారు.

ఆరోసారీ హాజరుకాని కేజ్రీవాల్

మళ్లీ సమన్లు పంపనున్న ఈడీ!

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మరో మారు ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. ఈడీ ఇప్పటివరకు ఆరు సార్లు సమన్లు జారీ చేయగా, కేజ్రీవాల్ వాటిని చట్టవిరుద్ధమైనవిగా పేర్కొంటూ కొట్టిపారేస్తున్నారు. ఈ విషయంపై ఈడీ కోర్టును ఆశ్రయించింది. ఢిల్లీ బడ్జెట్ సమావేశాల వల్ల కోర్టు విచారణకు కేజ్రీవాల్ హాజరు రాలేకపోయారని ఆయన న్యాయవాదులు కోర్టుకు గత శనివారం తెలియజేశారు. దీంతో కోర్టు విచారణ మార్చి 16కు వాయిదా పడింది. మరోవైపు కేజ్రీవాల్‌కు మళ్లీ సమన్లు పంపేందుకు ఈడీ సిద్ధమైంది. కోర్టు విచారణ జరుపుతుండగా మళ్లీ సమన్లు ఎలా పంపుతారని ఆప్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కోర్టు నిర్ణయం వచ్చే వరకు ఈడీ ఆగాలని, అలా కాకుండా పదే పదే సమన్లు జారీచేయటమేంటని ఆప్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు విచారణకు.. సమన్ల జారీకి సంబంధం లేదని ఈడీ పేర్కొన్నది.

అందుకు అంగీకరిస్తేనే కలిసి నడుస్తాం!

- యూపీలో కాంగ్రెస్‌కు 17 లోక్‌సభ సీట్లు ఇస్తామన్న ఎస్పీ

లక్నో: లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలో సీట్ల పంపకాల్లో భాగంగా, కాంగ్రెస్‌కు ఉత్తర ప్రదేశ్‌లో 17 స్థానాలను కేటాయిస్తామని అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ చెప్పింది. ఆ పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్‌కు 17 లోక్‌సభ స్థానాలను ఇస్తామని అంతిమంగా చెప్పామన్నారు. రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో న్యాయ యాత్ర మంగళవారం రాయ్‌బరేలీలో జరగబోతున్నదని, తమ ఆఫర్‌ను కాంగ్రెస్ అంగీకరించడంపైనే ఈ యాత్రలో అఖిలేశ్ పాల్గొనడం ఆధారపడి ఉంటుందని చెప్పారు.

ఏడాదిలో రెండు సార్లు బోర్డు పరీక్షలు!

- *2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు*
- *10, 12 తరగతుల పరీక్షలపై కేంద్రం వెల్లడి*

రాయ్‌పూర్: కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 10, 12 తరగతుల విద్యార్థులకు శుభవార్త చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో పీఎంశ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ తరగతుల బోర్డు పరీక్షలకు సంవత్సరంలో రెండుసార్లు హాజరయ్యే అవకాశాన్ని 2025-26 విద్యా సంవత్సరం నుంచి కల్పించనున్నట్లు తెలిపారు. రెండుసార్లు పరీక్షలు రాసి, మెరుగైన స్కోరునే ఉంచుకుని, మిగిలిన దానిని రద్దు చేసుకునే అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. 2020లో ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) లక్ష్యాలను వివరిస్తూ, విద్యార్థులపై విద్యా సంబంధిత ఒత్తిడిని తగ్గించడం ఈ లక్ష్యాల్లో ఒకటి అని తెలిపారు.

బీజేపీ లాక్కున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు 740 మంది

జేఎంఎం ఆరోపణలు

రాంచీ, ఫిబ్రవరి 19: : గడచిన పదేండ్లలో వేర్వేరు పార్టీలకు చెందిన 740 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారని, వీరందరిపైనా ఆ పార్టీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అవినీతి ఆరోపణలు చేసిందని జేఎంఎం ఆరోపించింది. ఇప్పుడు వారంతా బీజేపీకి ఇష్టమైనవారు అయిపోయారని ఎద్దేవా చేసింది. జేఎంఎం ప్రధాన కార్యదర్శి సుప్రియో భట్టాచార్య సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నవారంతా అవినీతిపరులేనని, తమ పార్టీలోనివారు మాత్రమే నిష్కళంకులని బీజేపీ భావిస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే వారిని దేశ వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నదన్నారు.

కోతుల కోసం మినీ సిటీ!

వాషింగ్టన్: అమెరికాలోని జార్జియా స్టేట్, బెయిన్‌బ్రిడ్జ్ పట్టణవాసులు సేఫర్ హ్యూమన్ మెడిసిన్ కంపెనీపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. 30 వేల కోతుల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఈ కంపెనీ ప్రకటించడంతో ప్రజలతోపాటు జంతు హక్కుల సంఘాలు కూడా మండిపడుతున్నాయి. సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, వీటిని వైద్య రంగంలో పరిశోధనల కోసం విశ్వవిద్యాలయాలు, ఫార్మాస్యుటికల్ కంపెనీలకు పంపిస్తామని ఈ కంపెనీ చెప్తున్నది. వీటి వల్ల ఈ ప్రాంతంలో వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నది. అయినప్పటికీ స్థానికులు తీవ్ర నిరసన తెలుపుతున్నారు. దాదాపు 14,000 జనాభా గల ఈ పట్టణంలో, 30,000 కోతులు ఉండటాన్ని తాము అంగీకరించబోమని, ఈ కంపెనీని తక్షణమే నిలిపేయాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

ఇంగ్లండ్ స్కూళ్లలో మొబైళ్లపై నిషేధం!

న్యూఢిల్లీ: విద్యార్థుల ప్రవర్తన, శ్రద్ధను మెరుగుపరిచేందుకు పాఠశాలల్లో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నిషేధించాలని యూకే ప్రభుత్వం నిర్ణయించింది. క్లాస్ రూములలో అంతరాయాలను తగ్గించడంతోపాటు విద్యార్థుల ప్రవర్తనను మెరుగుపరిచే ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాఠశాలలు పిల్లలు నేర్చుకునే ప్రదేశాలని, మొబైల్ ఫోన్లు తరగతి గదిలో అవాంఛనీయమైన పరధ్యానాన్ని కలిగిస్తాయని బ్రిటన్ విద్యాశాఖ మంత్రి గిలియన్ కీగన్ పేర్కొన్నారు. బ్రేక్, లంచ్ సమయంలో కూడా మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నిషేధిస్తున్నట్టు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థులు నిర్బంధం ఎదుర్కోవాల్సి వస్తుంది.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

జాతీయ మహిళా కమిషన్ డిమాండ్ • సందేశ్‌ఖాలీలో పర్యటన

రేఖాశర్మ

కోల్‌కతా, ఫిబ్రవరి 19: సందేశ్‌ఖాలీ కేసు.. పశ్చిమ బెంగాల్‌ను కుదిపేస్తున్నది. సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ) చైర్‌పర్సన్ రేఖా శర్మ డిమాండ్ చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖాలి గ్రామంలో ఎన్సీడబ్ల్యూ చీఫ్ రేఖాశర్మ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం పర్యటించింది. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'బాధిత మహిళలతో మాట్లాడిన తర్వాత, అక్కడ పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందన్నది స్పష్టమైంది. అత్యంత భయానక అనుభవాలున్నాయని అనేకమంది మహిళలు చెబుతున్నారు. పార్టీ కార్యాలయంలో ఓ మహిళపై రేప్ జరిగింది. సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలి. బెంగాల్‌లో రాష్ట్రపతి విధించాలి' అని ఆమె అన్నారు. సందేశ్‌ఖాలీ కేసులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించిన నివేదికలోనూ ఎస్సీ జాతీయ కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతిని కోరింది. ఇదిలా ఉండగా, సందేశ్‌ఖాలీ హింసపై కోర్టు పర్యవేక్షణలో సీబీఐ లేదా సిట్ దర్యాప్తు చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ కేసును మణిపూర్ పరిస్థితులతో పోల్చవద్దని, కేసుపై రాష్ట్ర హైకోర్టు నిర్ణయం తీసుకోవటమే సముచితమని ధర్మాసనం అభిప్రాయపడింది. మహిళలపై తృణమూల్ నాయకులు, గూండాలు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో సందేశ్‌ఖాలీలో గతకొద్ది రోజులుగా ఆందోళనలు జరుగుతున్నాయి. రాజకీయంగా ఇది దుమారం రేపుతున్నది.

పాస్‌పోర్ట్ ర్యాంకింగ్స్‌లో దిగజారిన భారత్

న్యూఢిల్లీ: ప్రపంచంలో మోస్ట్ పవర్‌ఫుల్ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్స్‌లో ఇండియా ఒక స్థానం పతనమైంది. సోమవారం విడుదలైన హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్, 2024 ప్రకారం, ఫ్రాన్స్ పాస్‌పోర్టు అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానాన్ని ఆక్రమించింది. ఫ్రాన్స్ పాస్‌పోర్ట్ హోల్డర్స్ 194 దేశాలకు వీసా లేకుండా వెళ్లే అవకాశం ఉంది. ఇండియా గత ఏడాది 84వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 85వ స్థానానికి పడిపోయింది. ఇండియన్ పాస్‌పోర్ట్ హోల్డర్స్ వీసా లేకుండా 62 దేశాల్లో ప్రయాణించవచ్చు.

'X' మార్క్ ఎందుకు వేశారు?

- చండీగఢ్ మేయర్ ఎన్నిక వివాదంపై సుప్రీంకోర్టు విచారణ
- రిటర్నింగ్ అధికారిపై ప్రశ్నల వర్షం
- తప్పు జరిగితే విచారణ ఎదుర్కోవాల్సిందేనన్న ధర్మాసనం

రిటర్నింగ్ అధికారి అనిల్ మసిహ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: చండీగఢ్ మేయర్ ఎన్నిక వివాదంపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. గత నెలాఖరులో మేయర్ ఎన్నికలను నిర్వహించిన రిటర్నింగ్ అధికారి అనిల్ మసిహ్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. పలువురు కౌన్సిలర్లు ఓటు వేసిన కొన్ని బ్యాలెట్ పేపర్లపై 'ఎక్స్(x)' మార్క్ ఎందుకు వేశారని సూటిగా ప్రశ్నించిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఏదైనా తప్పు జరిగి ఉంటే రిటర్నింగ్ అధికారి విచారణకు ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. బ్యాలెట్ పత్రాలపై రాతలు గీయడం ఎన్నికల ప్రజాస్వామ్యంలో అనుమతించదగ్గది కాదని పేర్కొన్నది. మేయర్ ఎన్నికల బ్యాలెట్ పత్రాలు, కౌంటింగ్‌కు సంబంధించిన వీడియో రికార్డింగ్‌ను మంగళవారం పరిశీలిస్తామని న్యాయస్థానం తెలిపింది. 'ఇది చాలా తీవ్రమైన అంశం. ఏదైనా తప్పు జరిగి ఉంటే, మిమ్మల్ని(రిటర్నింగ్ అధికారి) ప్రాసిక్యూట్ చేయాల్సి ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొన్నది. 'కెమెరా వైపు ఎందుకు చూస్తున్నారు? బ్యాలెట్ పత్రాలపై 'x' మార్క్ ఎందుకు వేశారు?' అని సీజేఐ ప్రశ్నించారు. దీనికి రిటర్నింగ్ అధికారి సమాధానమిస్తూ.. ఆ బ్యాలెట్ పత్రాలు అప్పటికే చెల్లనివని, తాను వాటిపై గుర్తు మాత్రమే వేశానని చెప్పారు. బ్యాలెట్ పత్రాలపై 'x' మార్క్ వేసినట్టు అంగీకరించిన అనిల్, అవి మిగతా వాటితో కలిసి పోకుండా ఉండేందుకే తాను ఆ పని చేశానని పేర్కొన్నారు. దీనికి ప్రతిస్పందగా న్యాయస్థానం.. 'సంబంధిత నిబంధనల ప్రకారం బ్యాలెట్ పత్రాలపై మీరు సంతకం మాత్రమే చేయగలరు! కానీ 'x' మార్క్ ఎందుకు వేశారు?' అని ప్రశ్నించింది. మంగళవారం కోర్టు విచారణకు రావాలని సీజేఐ ధర్మాసనం రిటర్నింగ్‌అధికారిని ఆదేశించింది.

కేరళ పాఠశాలల్లో 'వాటర్-బెల్'

తిరువనంతపురం: ఎండాకాలంలో తగినంత నీరు తాగే విధంగా పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేరళ ప్రభుత్వం వాటర్-బెల్ విధానాన్ని సోమవారం నుంచి అమలు చేస్తున్నది. ఎండా కాలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, విద్యార్థినీ, విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికావచ్చునని రాష్ట్ర సాధారణ విద్యా శాఖ మంత్రి వీ శివన్ కుట్టి చెప్పారు. దాహం వేయకపోయినా, మంచినీళ్లు తాగవలసి ఉంటుందని, అందుకే వారికి గుర్తు చేయడం కోసం గంట కొట్టే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. మంచి నీళ్లు తాగాలని విద్యార్థులకు గుర్తు చేయడం కోసం రోజూ నిర్ణీత సమయంలో రెండు సార్లు అన్ని పాఠశాలల్లోనూ గంటను మోగిస్తారు.

నావల్నీ తల, ఛాతిపై గాయాలు

మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయకపోవటంపై అనుమానాలు

మాస్కో: రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ జైల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందటంపై అంతర్జాతీయంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నావల్నీ తల, ఛాతిపై కమిలిన గాయాలున్నాయని స్థానిక మీడియాలో సోమవారం వార్తా కథనాలు వెలువడ్డాయి. మృతదేహాన్ని మార్చురికీ తరలిస్తుండగా ఈ గాయాలు కనపడ్డాయని అక్కడి దవాఖాన వైద్యుడ్ని ఉటంకిస్తూ వార్తా కథనం వెలువడింది. అతని భౌతికకాయాన్ని రష్యా ప్రభుత్వం తమకు అందజేయలేదని నావల్నీ కుటుంబ సభ్యులు, లీగల్ టీం సభ్యులు ఆరోపించారు.

అమెరికా ఎన్నికల్లో మరో 'రామస్వామి'

- జార్జియా సెనేట్ సీటుకు పోటీ
- 24 ఏండ్లకే బరిలోకి..

వాషింగ్టన్, ఫిబ్రవరి 19: అమెరికాలో జరుగనున్న ఎన్నికల్లో మరో 'రామస్వామి' అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. భారత సంతతికి చెందిన అశ్విన్ రామస్వామి (24) జార్జియా సెనేట్ స్థానానికి పోటీ చేస్తున్నారు. తద్వారా ఆ స్థానానికి పోటీ చేస్తున్న తొలి జనరేషన్-జడ్ (1997-2012 మధ్య జన్మించినవారు) ఇండో-అమెరికన్‌గా నిలిచారు. అశ్విన్ రామస్వామి తల్లిదండ్రులు 1990లో తమిళనాడు నుంచి అమెరికాకు వలస వెళ్లారు. జార్జియా రాష్ట్రానికి సేవ చేయాలన్న ఉద్దేశంతో అధికార డెమోక్రటిక్ పార్టీ తరపున ఆ రాష్ట్రంలోని డిస్ట్రిక్ట్ 48 స్టేట్ సెనేట్ కోసం పోటీ చేస్తున్నట్టు అశ్విన్ రామస్వామి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

నారీ శక్తి చేతల్లో చూపండి

- కోస్ట్‌గార్డ్‌లో మహిళలకు పర్మినెంట్ కమిషన్ ఏదీ?
- కేంద్రంపై సుప్రీం కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: నారీ శక్తి.. నారీశక్తి అంటూ చెప్పటం కాదు, కోస్ట్‌గార్డ్‌లో మహిళా అధికారులకు పర్మినెంట్ కమిషన్‌ను అమలు జేయాలి.. అంటూ కేంద్రాన్ని ఉద్దేశించి సుప్రీంకోర్టు సీజేఐ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమకు పర్మినెంట్ కమిషన్ అమలుజేయటం లేదని మహిళా కోస్ట్‌గార్డ్ ఉద్యోగి ప్రియాంక త్యాగి దాఖలుచేసిన పిటిషన్‌పై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. 'నారీ శక్తి.. నారీ శక్తి అంటూ చాలా మాట్లాడుతున్నారు (కేంద్రాన్ని ఉద్దేశించి). అదిక్కడ చూపి.. నిబద్ధత చాటుకోండి. పితృస్వామ్య ఆలోచనతో ఉన్నారు' అని సీజేఐ అన్నారు. భారత సైన్యం, నేవీలో అమలవుతున్న విధానం, కోస్ట్‌గార్డ్‌లో ఎందుకు నిరాకరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆర్మీ, నేవీతో పోల్చితే కోస్ట్‌గార్డ్ అన్నది మహిళలకు భిన్నమైనదన్న అడిషనల్ సొలిసిటర్ జనరల్ విక్రంజిత్ బెనర్జీ వాదనను సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. సరిహద్దుల వద్ద భద్రతను చేపడుతున్న మహిళలు, తీర ప్రాంతాన్ని కూడా రక్షిస్తారని ధర్మాసనం తెలిపింది.

దుబాయ్ విమాన ప్రయాణికుల్లో భారతీయులే టాప్

దుబాయ్: దుబాయ్ విమానాశ్రయం (డీఎక్స్‌బీ) గుండా ప్రయాణించేవారిలో అత్యధికులు భారతీయులే. డీఎక్స్‌బీ సోమవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 2023లో ఈ విమానాశ్రయం గుండా 1.19 కోట్ల మంది భారతీయులు ప్రయాణించారు. అంతకుముందు ఏడాది కంటే ఇది 31.7 శాతం అధికం. డీఎక్స్‌బీ నుంచి 104 దేశాల్లోని 262 పట్టణాలు, నగరాలకు విమానాల రాకపోకలు జరుగుతాయి. భారతీయుల తర్వాతి స్థానాల్లో సౌదీ అరేబియా (67 లక్షల మంది), బ్రిటన్ (59 లక్షల మంది) ప్రయాణికులు ఉన్నారు.

అతిగా యాంటీస్లీప్ పిల్స్.. కుప్పకూలిన విద్యార్థిని

లక్నో:యూపీలోని లక్నోకు చెందిన ప్రజక్త సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల కోసం నిద్ర మానుకుని చదువుకుంటున్నది. నిద్ర పట్టకుండా నిరోధించడం కోసం ఆమె తల్లిదండ్రులకు చెప్పకుండా ఓ వైపు అతిగా యాంటీ స్లీప్ పిల్స్‌ను వాడుతుండగా, మరోవైపు ఆమె తల్లి ఆమెకు నిద్ర రాకుండా ఉండటం కోసం కాఫీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ఇటీవల రాత్రంతా చదువుకున్న ప్రజక్త ఇంట్లోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆమె మెదడులో రక్తం గడ్డ కట్టినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. దీంతో ఆమెకు శస్త్ర చికిత్స చేశారు. పరీక్షల కోసం తయారయ్యే బాలలు యాంటీ స్లీప్ పిల్స్, కాఫీ, టీ వంటివాటిని అతిగా వాడుతుండటంతో అనారోగ్యం పాలవుతున్నారు.

త్వరలో 50 అమృత్ భారత్ రైళ్లు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: అమృత్ భారత్ రైళ్లకు మంచి స్పందన వస్తున్న క్రమంలో త్వరలో మరికొన్ని రైళ్లను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా 50 రైళ్లకు ఆమోదం తెలిపినట్టు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తాజాగా తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. అమృత్ భారత్ రైలు సర్వీస్ భారీ విజయం సాధించిందని, దీంతో మరిన్ని రైళ్లకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. అన్నీ నాన్ ఏసీ బోగీలు ఉండే రెండు అమృత్ భారత్ రైళ్లను గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభించారు.



మార్స్‌పైకి ఇస్రో డ్రోన్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: మంగళయాన్ తర్వాత భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అంగారక ప్రయోగానికి సిద్ధమవుతున్నది. నాసా ప్రయోగించిన ఇంజిన్యూటీ క్వాడ్‌కాప్టర్ మాదిరిగా ఇస్రో కూడా మార్స్‌పైకి రోటోకాప్టర్‌ను పంపేందుకు యోచిస్తున్నది. ఈ డ్రోన్ మార్స్ వాతావరణంపై పరిశోధన చేసేందుకుగానూ 100 మీటర్ల ఎత్తులో ఎగురుతుందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఇంకా ప్రాథమిక దశలో ఉన్న ఇస్రో రోటోకాప్టర్.. ఉష్ణోగ్రత, తేమ, పీడనం, గాలి వేగం, ఎలక్ట్రిక్ ఫీల్డ్, డస్ట్ సెన్సర్లను అంగారకుడిపైకి తీసుకెళ్లనున్నది. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రయోగించిన క్వాడ్‌కాప్టర్ ఇటీవలే మూడేండ్ల మిషన్‌ను పూర్తి చేసుకొన్నది.

అంగారక వాతావరణంలో నివసిస్తారా?

ఔత్సాహికులకు నాసా ఆహ్వానం

వాషింగ్టన్: మార్స్‌ను పోలిన వాతావరణంలో నివసించేందుకు ఆసక్తి ఉన్న వారి కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2024 ఏప్రిల్ 2. మార్స్‌పై ఉన్న వాతావరణం, అనుభూతిని కలిగించే.. 1,700 చదరపు అడుగుల ఆవాసాన్ని భూమిపై నాసా నిర్మిస్తున్నది. ఎంపిక చేసిన నలుగురు అభ్యర్థుల్ని ఈ ఆవాసంలోకి పంపి.. ఒక ఏడాదిపాటు వారిపై పరీక్షలు జరపనున్నది. ఒత్తిడితో కూడిన వాతావరణం, పరిమిత వనరులతో సవాళ్లను ఎదుర్కోవటం.. వంటివి పరిశీలిస్తుంది. అయితే అభ్యర్థులు అమెరికా పౌరులై ఉండాలి.

వృద్ధులకు తప్పనిసరి సేవింగ్స్ ప్లాన్!

- ప్రభుత్వ మేధోసంస్థ నీతి ఆయోగ్ సూచన
- 2050 నాటికి దేశ జనాభాలో 19.5 శాతం వృద్ధులు



న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశ జనాభాలో 10 శాతంగా ఉన్న సీనియర్ సిటిజన్ల(వృద్ధులు) సంఖ్య 2050 నాటికి 19.5 శాతానికి చేరుకొంటుందని నీతిఆయోగ్ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో వృద్ధుల సంక్షేమానికి సంబంధించి నీతి ఆయోగ్ కీలక ప్రతిపాదనలు చేసింది. వృద్ధులకు తప్పనిసరిగా సేవింగ్స్, హౌసింగ్ ప్లాన్ ఉండేలా చూడాలని సూచించింది. అలాగే వయోధికులపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు సీనియర్ కేర్ ఉత్పత్తులపై పన్ను తగ్గింపు, జీఎస్టీ సంస్కరణలు తేవాలని అభిప్రాయపడింది. తమకు అవసరమైన సేవలను సులభంగా పొందేందుకు సీనియర్ సిటిజన్ల కోసం ఒక జాతీయ పోర్టల్‌ను తప్పనిసరిగా అభివృద్ధి చేయాలని నీతి ఆయోగ్ పేర్కొన్నది. చాలా మంది వృద్ధులు తమ సేవింగ్స్ నుంచి వస్తున్న ఆదాయంపై ఆధారపడుతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో సీనియర్ సిటిజన్లు తమ డిపాజిట్లపై పొందే వడ్డీకి ఆచరణీయమైన బేస్ రేటును నిర్ణయించేందుకు ఒక నియంత్రణ యంత్రాంగం అవసరమని పేర్కొన్నది.